# About Vice-principal.....



కళంటే కేవలం బొమ్మలు గీయడమో... పాటలు పాడ డమో... కానక్కర్లేదు ! ఒక సంస్థలో, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సమర్థవంతంగా పరిపాలన నిర్వహించటం కూడా ఓ కళే అనుకుంటే... అలాంటి కళని కళ్లారా చూసిన ఓ సంఘటనని మీ ముందుంచుతున్నాను.

అవి... 'అమృత కిరణ్' పక్ష పత్రిక నడుస్తోన్న రోజులు. లంచ్ టైంలో కలిసాను సుజాత, వసంత, ప్రభా మేడంలను.

ఏదో ఫైల్ అవసరమై ఓ ఆయాకి ఆ పనిని పురమాయించారు సుజాతగారు. ఏ బీరువాలో - ఎక్కడ ఏ మూల - ఏ రంగు ఫైలో వివరంగా చెప్పి పంపారు. ఐదారు నిమిషాల తరువాత ఫైల్ కనిపించలేదని వొట్టి చేతుల్తో తిరిగొచ్చింది ఆయా.

మళ్ళీ అవే ఆనవాళ్ళు, అదే రీతిలో చెప్పి పంపారు సుజాత. ఆయా మళ్ళీ వొట్టి చేతుల్తో వెనక్కి వచ్చింది, ఇలా మూడు సార్లు జరిగింది.

ఇహ లాభంలేదని సుజాత తానే లేచి ఆయాని వెంట బెట్టుకొని ఆ ఫైల్ ఉన్న రూం వైపు నడిచారు, వెంటే నేనూ వెళ్ళాను. సుజాతగారు బీరువా తీసి ఫైల్‌ని బయటకు తీసారు. తాను చెప్పిన ఆనవాళ్ళకి ఏ మాత్రం పొల్లుపోని రీతిలో - అదే బీరువాలో, అదే స్థానంలో, అదే రంగు ఫైలు- ఆమె చేతికి చిక్కింది.

మూడుసార్లు ఆయా వెతికినా ఫైల్ దొరకలేదంటే... చెప్పటంలో ఏదైనా పొరపాటు ఉండి ఉంటుందేమోననే సందేహం రావటం సహజం - కానీ అలా జరగనందుకు నేనాశ్చర్యపోయాను...!

'చెప్పేటప్పుడు సరిగ్గా వినాలి, వెతికేటప్పుడు మనసు పెట్టి వెతకాలి, మీకు చెప్పేకంటే నేను వెతుక్కుందేనయం అనిపించేలా నడుచుకోకూడదు'! - అని ఆనాడు ఆవిడ ఆయాని మందలించిన తీరు నన్ను ముగ్ధురాల్ని చేసింది!

సాధారణంగా... నూటికి తొంభై తొమ్మిది మంది అధికారులు తమ కింది స్థాయి వాళ్ళు పొరపాటు చేస్తే- కోపాన్ని వాళ్ళమీద భళ్ళున వెళ్ళగక్కడమో.... ఒక్కోదశలో బ్రహ్మాండం బద్దలైపోయేలా విరుచుకుపడటమో... నరాలు చితికిపోతాయేమోనన్నంత తారాస్థాయిలో గొంతుచించుకొని, ఊరూ వాడా దద్దరిల్లేలా అరవటమో.... చేస్తుంటారు!

కానీ దానికి భిన్నంగా... తిట్లూ, అరుపులూ లేకుండా... కేవలం తీవ్రత మాత్రమే చోటు చేసుకున్న సుజాతగారి మందలింపు- 'ఆమె స్థానంలో ఆ టైంలో నేనే ఉండివుంటే ఎలా ప్రవర్తించి ఉండేదాన్ని' అని నన్ను నేను ఆత్మపరిశీలన చేసుకునేలా చేసింది.

నేను తెలిసి.... బుద్ధెరిగిన తర్వాత - మందలింపులోనూ హుందాతనం చూపెట్టిన ఏకైక స్త్రీమూర్తిని మొదటిసారిగా చూశాను.

**-జి. ఇందిరాదేవి**
M.A.,M.Ed.,LL.B



'అబ్బ ! సోషల్ స్టడీస్ ! పెద్ద పెద్ద జవాబులు. ఏం చదవాలి - ఎలా చదవాలి? బైహర్ట్ చేయాలంటే కష్టం. ఎంత రాసినా మార్కులు రావు!' సోషల్ స్టడీస్ విషయంలో ఇదీ నా అభిప్రాయం సుజాత మేడం మా క్లాసుకు రాకముందు.

నేను టెన్త్‌లో ఉన్నప్పుడు సోషల్‌స్టడీస్‌కి సుజాతా మేడం వచ్చేవారు. 'బెల్ 'అయిందంటే చాలు - చేతిలో రోలింగ్ మ్యాప్‌తో ప్రత్యక్షమయ్యేవారు.

క్లాస్‌కి వచ్చీరాగానే గోడకి రోలింగ్ మ్యాప్ తగిలించేవారు- క్షణం ఆలస్యం చేయకుండా - ఆ క్రితం రోజు అయిపోయిన పాఠానికి సంబంధించిన దేశాలను పిల్లలందర్తో లొకేట్ చేయించేవారు.

సోషల్ స్టడీస్‌లో మ్యాప్ పాయింటింగ్ కంపల్సరీ క్వెశ్చన్, 10 మార్కులు స్కోర్ చేయగలిగేది అయినప్పటికినీ- ప్రపంచంలోని దేశాలన్నీ గుర్తుంచుకోవాలంటే పరమ విసుగని పించేది! కానీ సుజాతా మేడం టీచింగ్, మ్యాప్ పాయింటింగ్ విషయంలో- ఎంతో సరదాగా - లైవ్లీగా మాతో ఆడుకున్నట్టుగా సాగేది.

ఇప్పుడు నేను బి.టెక్ థర్డ్‌ఇయర్‌లో ఉన్నాను. నా సీనియర్సెందరో యు.యస్.ఏ, కెనడాలో స్థిరపడిపోయారు. వాళ్ళు ఇండియా వచ్చినపుడు - వాళ్ళుండే స్టేట్స్ పేర్లు చెప్పినప్పుడల్లా - నా క్లాస్‌మేట్స్ అవెక్కడున్నాయో చెప్పమని అడిగేవారు. అప్పటికప్పుడూ అట్లాస్ తెచ్చుకుని మరీ చూసేవాళ్లు.

నేను మాత్రం ఫలానా చోట ఉందని టక్కున చెప్పేస్తుంటాను ! నేనలా చెప్పగలిగినప్పుడల్లా - నాకు సుజాతా మేడం గుర్తొస్తారంటే - ఆ రోజుల్లో మ్యాప్ పాయింటింగ్ విషయంలో ఆమె చూపించిన శ్రద్ధాసక్తులే కారణం !

So I respect her for her method of teaching.

**-L.S. Harsha Kiran**
**B.Tech. III Year,**
**U.C.O.T-O.U-Hyd.**

## ఆమె రికార్డు

గత పాతికేళ్ళలో విజయ్ హైస్కూల్ పనిదినాలు 5479 అయితే, శ్రీమతి పి. సుజాత 4957 రోజులు (90%) పనిచేసి, స్కూల్‌కి తమ అమూల్య సేవలందించిన వారందర్లో ప్రథమురాలిగా నిలిచారు.

ఇరవై అయిదేళ్ళలో జరిగిన 26 టాలెంట్ పోలకి క్రమం తప్పకుండా హాజరైన వారిలోనూ శ్రీమతి పి. సుజాతదే అగ్రస్థానం!

In every inch, she is very dedicated to her profession.